క్లుప్తంగా

ఆర్టీసీని ఆదరించాలి



మాట్లాడుతున్న మధిర డిపో మేనేజర్ దేవదానం

వైరా: గ్రామాల దూరాన్ని తగ్గిస్తూ, ప్రజలను దగ్గరకు చేస్తున్న ఆర్టీసీని ఆదరించాలని మధిర డిపో మేనేజర్ దేవదానం అన్నారు. గురువారం వైరా బస్టాండ్‌లో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా తమ గమ్యాలకు చేరుకోవాలన్నారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైరా స్టేషన్ మేనేజర్ ఏవీఎల్‌ఓ జీఆర్ రెడ్డి, ఏడీసీ హనుమంతరావు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

ఏన్కూరు: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షల నిర్వహణలో విఫలమైందని తెలుగుదేశం వైరా నియోజకవర్గ నాయకుడు రామయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం శిక్షణ పొంది నిరీక్షిస్తున్న విద్యార్థులకు పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ కావడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ చెలగాటం ఆడుతుందన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై తక్షణమే విచారించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: వేసవికాలం దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం డీఎం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో కార్మికులు, ఉద్యోగులకు డీఎం రాజలక్ష్మి చేతుల మీదుగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, గుంషావలి, రవికుమార్, బాజీ, బాబా, శ్రీను, యాసిన్, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ వెంకటనారాయణ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ

మధిర: అక్రమంగా ఇసుక చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధిర, బోనకల్లు మీదగా రోజు వందల లారీల్లో ఖమ్మంకు అక్రమంగా ఇసుక రవాణా అవుతోందన్నారు. ఈక్రమంలో తాము బుధవారం రాత్రి లారీలను అడ్డుకుంటే బీజేపీ కార్యకర్త సత్యనారాయణపై దాడి చేశారని, అక్రమార్కులకు స్థానిక పోలీసుల సహకారం ఉండడంతోనే చెలరేగిపోతున్నారని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక రవాణాదారులతో పాటు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరావు, నాయకులు చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, జానీ, మర్సకట్ల స్వర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న షేక్ నాగూర్ వలి

మధిర : ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ మండల అధ్యక్షుడు వినోద్ రావు అధ్యక్షతన గురువారం ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కస్తూరిబాయి, వీరయ్య, జీబీఎంఎస్ రాణి, ఇబ్రహీం, సాధు సమాధానం, భాస్కరరావు, రాజు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు పడుతుందో..!

నత్తనడకన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఇప్పటికీ 45 శాతం మేర పనులే పూర్తి



సత్తుపల్లిలో బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలల తరబడి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు చేపడుతున్నారు. ఇటీవల కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ మొగిలి స్నేహలత మార్కెట్ నిర్మాణ పనులు పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించినా.. ఆశించిన స్థాయిలో పనులు జరగని పరిస్థితి నెలకొంది.

మంత్రి కేటీఆర్ శంకుస్థాపన..

తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులతో సత్తుపల్లి మున్సిపాల్టీలో సమీకృత మార్కెట్‌కు 2021 ఏప్రిల్ 2న రాష్ట్ర పురపాలక శాఖామంత్రి కె.తారకరామారావు శంకుస్థాపన చేశారు. రూ.4.50 కోట్లతో స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన గల రెండు ఎకరాల స్థలంలో 60 వెజ్ దుకాణాలు, 46 నాన్‌వెజ్ దుకాణాలతో నిర్మాణం చేపడుతున్నారు. దీనిని రెండు బ్లాక్‌లుగా తీర్చిదిద్దనున్నారు. మార్కెట్‌కు వచ్చేవారికి వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పార్కింగ్, గ్రీనరీ, కాంపౌండ్‌వాల్, ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు.

అన్నీ ఒకేచోట లభించేలా..

పట్టణంలో కూరగాయలు, మటన్, చికెన్, చేపలు కొనుగోలు చేయాలంటే వేర్వేరు చోట్లకు వెళ్లాల్సిన పని లేకుండా.. వీధి వ్యాపారులతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేలా ఆధునిక సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. పండ్లు, పూలు కొనుగోలు చేసేందుకు అటూ.. ఇటూ తిరిగే పని లేకుండా ప్రజలకు అన్నీ ఒకేచోట లభించేలా మార్కెట్‌కు ప్రభుత్వం రూపకల్పన చేసింది.

పురోగతి లేక..

ప్రభుత్వం సమీకృత మార్కెట్ నిర్మాణం 12 నెలల్లో పూర్తి చేసి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇక్కడ పనులు చేపట్టి సంవత్సరం కావస్తున్నా.. ఇప్పటి వరకు 45 శాతం మాత్రమే నిర్మాణ పనులు జరిగాయి. నిర్మాణం పూర్తి కావటానికి మరికొంత కాలం పెరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు పర్యవేక్షించి సత్వరమే మార్కెట్ పనులు పూర్తి అయ్యేలా చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల వేగవంతానికి చర్యలు..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక బ్లాక్ శ్లాబ్ దశకు వచ్చాయి. నిర్మాణ పనులను 3 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

జన చైతన్య యాత్రను జయప్రదం చేయండి



ఏన్కూరు: యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఏన్కూరు/బోనకల్: మతోన్మాద విధానానికి వ్యతిరేకంగా జరిగే జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా నాగేశ్వరావు కోరారు. గురువారం ఏన్కూరు మండల కేంద్రంలో యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బోనకల్ మండలంలోని స్థానిక సీపీఎం కార్యాలయంలో బందం శ్రీనివాసరావు అధ్యక్షతన మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాన్ని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 17న వరంగల్ జిల్లాలో ప్రారంభమై 29న హైదరాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ప్రజలు ప్రజాస్వామికవాదులు, లౌకికవాదులు, మేధావులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు జనచైతన్యయాత్ర ఏన్కూరు చేరుకుటుందన్నారు. సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో మోదీ, అమిత్‌షాలు ప్రభుత్వం రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ రంగాలకు దారాదత్తం చేస్తుందన్నారు. మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే దేశప్రజలకు ప్రభుత్వ రంగ సంస్థలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1250కు పెరిగిందన్నారు. ఇది సామాన్య ప్రజలపై భారంగా మారిందన్నారు. ఖమ్మం జిల్లా గడ్డపై బీజేపీ ఆటలు సాగనివ్వం అన్నారు. ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యులు పొన్నం వెంకటేశ్వరావు, మాదినేని రమేష్, భూక్య వీరభద్రం, మెరుగు సత్యనారాయణ, బాణోతు బాలాజీ, డి నాగేశ్వరావు, బుచ్చల వెంకటేశ్వర్లు, ఏర్పుల రాములు, ఇటికాల లెనిన్, గుడ్ల వెంకటేశ్వర్లు, చింతలచెర్వు కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు సరికాదు

తల్లాడ: ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి విమర్శలు చేయడం సరికాదని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎక్కిరాల సుదర్శన్‌రావు అన్నారు. గురువారం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో తల్లాడలోని స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్‌లో రవి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎక్కిరాల సుదర్శన్‌రావు, జమలయ్య, ఆశీర్వాదం, అంబేడ్కర్, ఉదయ్, పెద్దబ్బాయి, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రకు తరలిన నాయకులు



యాత్రకు బయలుదేరుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు గురువారం మండలంలోని పలు గ్రామాల కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఈ యాత్రకు వెళ్లేందుకు మండలంలోని మీనవోలులో బస్సును పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిలు లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



గన్నవరంలో సైకిల్ ప్రదర్శన నిర్వహిస్తున్న రైతు సంఘం బాధ్యులు

వైరారూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని గన్నవరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పాదయాత్ర నిర్వహించారు. నాగేశ్వరరావు, రమణ, జయరాజ్, మజీద్, వెంకటరెడ్డి, తిరుమలరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాప్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్, నాలెడ్జ్ (టాస్క్) వారి ఆధ్వర్యంలో బీటెక్, సీఈసీ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభమయ్యింది. ఈ వర్క్‌షాప్‌ను కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.జాన్ బాబు ప్రారంభించారు. టాస్క్ రిసోర్స్ పర్సన్ ఎస్ హేమంత్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, హెచ్‌ఓడీలు, చిన్నయ్య, అనూష, సంధ్యారాణి, వనజ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


అమరజీవి పొట్టి శ్రీరాములు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గురువారం అన్ని మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రం సాధించుకోగలిగామని, ఆయన త్యాగాన్ని ఎవరు మరువలేదని అన్నారు.


– సాక్షి నెట్‌వర్క్



వైరా: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం, లయన్స్‌క్లబ్ సభ్యులు



మధిర: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



కల్లూరు: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

'కంటి వెలుగు' ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: మండలంలోని తెలగవరం గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా కంటి వెలుగును ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, స్థానిక సర్పంచ్ కృష్ణయ్య, మురళీదర్‌రావు, వైద్యాధికారి రత్న మనోహర్, చలపతిరావు, నరేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, భీమవరం గ్రామాల్లోని సాయిబాబా ఆలయంలో గురువారం సాయినాథునికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసాయికి సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని మీనవోలు, పెగళ్లపాడు, తెల్లపాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు బాబాను దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. ఎర్రుపాలెంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి తుమ్మల పరామర్శ

సత్తుపల్లిరూరల్: మండలంలోని తాళ్లమడ గ్రామానికి చెందిన బొప్పన రుక్మిణమ్మ దశదిన కర్మకు మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో చలసాని సాంబశివరావు, చల్లగుండ్ల నర్సింహారావు, టోపీ శ్రీను పాల్గొన్నారు.

కేసు నమోదు

కారేపల్లి: గ్రామస్తులు నడిచే రహదారికి అడ్డంగా బండరాళ్లను వేసి, దారిని మూసివేసిన ఇద్దరు వ్యక్తులపై కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సామ్యతండా గ్రామానికి చెందిన భూక్యా లచ్చు, అశోక్ అనే ఇద్దరు వ్యక్తులు గత 30 ఏళ్లుగా గ్రామస్తులు పోలాలకు వెళ్లే డొంకదారిని బండరాళ్లతో మూసి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో పాటు, అదే డొంకదారి గుండా తమ ఇంటికి వెళ్లే గుగులోతు రమేష్ అనే వ్యక్తిని సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై రమేష్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు లచ్చు, అశోక్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ముదిగొండ: ఓ టాటాఏస్ వాహనం పల్టీ కొట్టిన సంఘటన మండలంలోని బాణాపురం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. టాటాఎస్ కోదాడ నుంచి బాణాపురం మీదుగా బోనకల్ వెళ్తున్న క్రమంలో పెట్రోల్ బంక్ సమీపంలో మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ క్రమంలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం లేనందున తృటిలో ప్రమాదం తప్పింది.

కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టాలి



కల్లూరు : టీఎన్జీవోస్ డైరీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సండ్ర, అధికారులు

వేంసూరు/కల్లూరు: స్వార్థంతో తప్పుడు పద్ధతిలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న వారి కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. వేంసూరు తహసీల్దార్ కార్యలయం ఆవరణలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు జీఓ 58, 59 ద్వారా మంజూరైన పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆత్మగౌరవం పెంచి, ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నది సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. కాగా, పార్టీ ఇచ్చిన పదవులను అనుభవించిన కొందరు ఇప్పుడు సీనియర్ల పేర్లతో రాజకీయం చేస్తున్నారని... రాజకీయాల్లో సీనియర్లు, జూనియర్లు అని కాకుండా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచేవారే అసలైన నాయకులని చెప్పారు. సాగర్ ఆయకట్టు పరిధిలో ఒక్క ఎకరం పంట కూడా ఎండికుండా నీరు ఇస్తున్నామని తెలిపారు. ఇక కల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో 58, 59 జీఓల ద్వారా పేదలకు ఎమ్మెల్యే సండ్ర పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. కాగా, డబుల్ బెడ్‌రూమ్ గృహాల విషయంలో కొందరు తమ స్వార్థం కోసం నిరుపేదలను రెచ్చకొడుతున్నారని... అర్హులెవరైనా ఉంటే గృహలక్ష్మి పథకంలో రూ.3లక్షలు మంజూరు చేయిస్తామని తెలిపారు. అతర్వాత టీఎన్‌జీఓఎస్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లు, డైరీలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈకార్యక్రమాల్లో ఆర్డీఓ సూర్యానారాయణ, ఏసీపీ రామానుజం, ఎంపీపీలు పగుట్ల వెంకటేశ్వరరావు, బీరవెల్లి రఘు, జెడ్పీటీసీలు మారోజు సుమలత, కట్టా అజయ్‌కుమార్, తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌తో పాటు దొడ్డ శ్రీలక్ష్మీ, గొర్ల శ్రీనివాసరెడ్డి, మందపాటి మహేశ్వరరెడ్డి, మందపాటి సత్యానారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, స్టాలిన్, అన్వర్, డాక్టర్ లక్కినేని రఘు, పాలెపు రామారావు, బోబోలు లక్ష్మణరావు, కాటమనేని వెంకటేశ్వరరావు, కమ్లీ, సీహెచ్.కిరణ్, కొందూరు కిరణ్‌కుమార్, మాదిరాజు లక్ష్మణరావు, టీఎన్జీవోస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ.వజీరుద్దీన్, పి.సువర్ణపాల్, అన్వర్, కె.నరేష్, కవిత, చార్లెస్, రామారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని వినతి



కలెక్టర్ గౌతమ్‌కు విన్నవిస్తున్న గోవిందరావు

చింతకాని/ఖమ్మం సహకారనగర్: చింతకాని మండలం వందనం, కొదుమూరు, రాఘవాపురం గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటకు కొతుమూరు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు కోరారు. ఈమేరకు గురువారం ఖమ్మం కలెక్టరేట్ కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావును రైతులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. వందనం, కొదుమూరు, రాఘవాపురం గ్రామాలకు సాగునీరు ఇచ్చేందుకు వెంకటాయపాలెం వద్ద నిర్మించిన వందనం – కొదుమూరు ఎత్తిపోతల పథకానికి ఎన్నెస్పీ అధికారులు నీటి విడుదల నిలిపివేయటంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని గోవిందరావుతో పాటు రైతులు మాదినేని రవి, పెంట్యాల అప్పారావు, కూచిపూడి కోటేశ్వరరావు, బాబురావు, సోమ్లానాయక్ కోరారు.

బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న రైతులు, పొంగులేటి వర్గం నాయకులు

బోనకల్: మండలంలో మొక్కజొన్న ఎక్కడా ఎండిపోలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బందం శ్రీనివాసరావు చెప్పడం గర్హనీయమని పలువురు రైతులు పేర్కొన్నారు. మండలంలోని ఆళ్లపాడులో గురువారం రైతులు మందా రాజ్యం, కాసాని నాగేశ్వరరావు, ఆవుల వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ ఆళ్లపాడులో కేవలం నాలుగెకరాల్లోనే మొక్కజొన్న ఎండిపోయిందని చెప్పడం సరికాదన్నారు. కాగా, మధిర మార్కెట్ పదవి కోసం అధికార పార్టీ నాయకులతో అంటకాగుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు ఇకనైనా తీరు మార్చుకోవాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం నాయకులు సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మందడపు తిరుమలరావు, ఉమ్మినేని కృష్ణ, చిలక వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ గతంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌ను అడ్డుకుని, ఇప్పుడు ఆయన వెంటే నడుస్తున్న శ్రీనివాసరావు తీరును అందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం



డాక్టర్ మట్టా దయానంద్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

సత్తుపల్లి: పట్టణంలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల సాయిబాబా మందిరంలో గురువారం డాక్టర్ మట్టా దయానంద్, మట్టా రాగమయి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల డాక్టర్ మట్టా దయానంద్ అస్వస్థతకు గురై ఆరోగ్యంగా తిరిగి రావటంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సాంబశివరావు, సుజాత, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి



కల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

కల్లూరు: అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.రజితలు అన్నారు. గురువారం అగ్రిగోల్డ్ బాధితులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు అగ్రిగోల్డ్ సంస్థ నుంచి రావాల్సిన డబ్బులు ఇప్పించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్ ఆస్తులు తెలంగాణాలో రూ.1000కోట్ల వరకు ఉన్నాయన్నారు. అగ్రిగోల్డ్ కట్టి నష్టపోయిన బాధితులకు డబ్బులు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోవడం లేదని వాపోయారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడెల్లి నాగేశ్వరరావు, ఎస్కే పాష, లక్ష్మీ, రాజకుమారి, రాజేశ్వరరావు, భూమా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నర్సరీల్లోనే హరితహారం..!



అధికారుల నిర్లక్ష్యంతో హరితహారం అబాసుపాలు అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత మొక్కలు నర్సరీల్లోనే పెద్దవై నాటేందుకు అనుకూలించడం లేదు. దీంతో ఆ మొక్కలను నాటకుండా వదిలేస్తున్నారు. ముదిగొండ మండలంలోని వనంవారికిష్టాపురం, చిరుమర్రి, ముదిగొండ, కట్టకూరు, తదితర గ్రామాల్లో నర్సరీల్లో మొక్కలు ప్రతి ఏటా పెద్దవిగా పెరిగి నాటేందుకు అనుకూలించడం లేదు. దీంతో అధికారులు వాటికి వెచ్చించిన వ్యయం వృథా అవుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పలుచోట్ల నాటిన మొక్కలకు రక్షణ కల్పించడంలేదు. కావున ఇప్పటికైన సంబంధిత అధికారులు మొక్కలను ఎప్పటికప్పుడు నాటి వాటికి రక్షణ కల్పించి తమ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : దామోదర్, పంచాయతీ కార్యదర్శి, వనంవారికి కిష్టాపురం, ముదిగొండ
సెల్ నంబర్ : 8978774386